ఆన్‌లైన్ బుకింగ్ లేకున్నా శబరిమల దర్శనం

కేరళ ప్రభుత్వం ప్రకటన

తిరువనంతపురం, అక్టోబర్ 15: కేరళలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలకు వచ్చే భక్తుల దర్శనంపై విధించిన ఆంక్షల విషయంలో పినరయి విజయన్ సర్కారు యూటర్న్ తీసుకుంది. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోని భక్తులు సైతం శబరిమల అయ్యప్పను సాఫీగా దర్శనం చేసుకోవచ్చునని మంగళవారం ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న భక్తులకు మాత్రమే దర్శనం కల్పిస్తామంటూ ఇంతకుముందు విజయన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భక్తుల నుంచి పెద్దయెత్తున నిరసన వ్యక్తం అయ్యింది. దీంతో సీఎం విజయన్ మంగళవారం దీనిపై అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తులతో పాటు, రిజిస్ట్రేషన్ లేకుండా నేరుగా వచ్చిన భక్తులకు కూడా దర్శనం కల్పిస్తామని తెలిపారు. వర్చువల్ బుకింగ్‌ను విపక్షాలు, భక్తులు విమర్శించడంతో సర్కార్ దిగివచ్చింది.

ఉచితాలను లంచంగా పరిగణించాలి

- సుప్రీంకోర్టులో పిల్
- కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలను లంచంగా పరిగణించాలన్న పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్రం, ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. ఎన్నికలకు ముందు ఉచితాలు ప్రకటించకుండా రాజకీయ పార్టీలను నిలువరించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన శశాంక్ జే శ్రీధర దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘం స్పందన కోరింది. పార్టీలు ఇస్తున్న ఉచిత హామీల వల్ల ఖజానాపై అధిక భారం పడుతున్నదని, ఎన్నికల్లో ఓట్లు సంపాదించుకునేందుకు చేసే ఈ వాగ్దానాలను నెరవేర్చేందుకు అవసరమైన యంత్రాంగం ఏదీ లేదని శ్రీధర తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

40% వైకల్యం ఎంబీబీఎస్‌కు అడంకి కాదు

సుప్రీం కోర్టు తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: కేవలం 40 శాతం వైకల్యం ఒక వ్యక్తిని వైద్య విద్య చదవకుండా నిరోధించలేదని సుప్రీం కోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ఎంబీబీఎస్ చదవడానికి అతడు అసమర్థుడని నిపుణులు నివేదిక ఇస్తే తప్ప, వైకల్యం అతడి చదువుకు అడ్డంకి కాదని తెలిపింది. ఓ వికలాంగుడు ఎలాంటి అడ్డంకి లేకుండా వైద్య విద్య అభ్యసించవచ్చని మెడికల్ బోర్డు అభిప్రాయపడిన తర్వాత, అతడు ఎంబీబీఎస్‌లో చేరడానికి సెప్టెంబర్ 18న సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. తాను ఇచ్చిన ఆదేశాలకు కోర్టు వివరంగా కారణాలను తెలిపింది. ఎంబీబీఎస్ చదవాలనుకొనే వికలాంగ అభ్యర్థి సామర్థ్యాన్ని వైకల్య మదింపు బోర్డు పరీక్షించాలని తెలిపింది.

సరిహద్దు రోడ్లను పేల్చేసిన ఉత్తరకొరియా

సియోల్, అక్టోబర్ 15: ఉత్తర కొరియా అన్నంత పని చేసింది. దక్షిణకొరియాతో అనుసంధానం చేసే సరిహద్దులోని రోడ్డు, రైల్వే మార్గాలను పేల్చేసింది. దక్షిణ కొరియా సైన్యం మంగళవారం ఈ విషయం వెల్లడించింది. ఉత్తర కొరియా చర్యతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఉత్తర కొరియా చర్యకు ప్రతిస్పందనగా దక్షిణ కొరియా సైన్యం సరిహద్దు వద్ద హెచ్చరిక కాల్పులు జరిపింది. తమ దేశ రాజధానివైకి దక్షిణ కొరియా డ్రోన్లను పంపుతున్నదని ఉత్తర కొరియా ఇటీవల ఆరోపించడంతో రెండు దేశాల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది.

ఏడు విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: దేశంలో ఒకే రోజు ఏడు దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. అమెరికా, సింగపూర్ వెళ్లే విమానాలు సహా ఏడింటికి మంగళవారం గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఎక్స్ మాధ్యమం ద్వారా ఈ బాంబు బెదిరింపులు వచ్చాయి. కొన్ని విమానాలను ముందు జాగ్రత్త చర్యగా అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఢిల్లీ నుంచి షికాగో వెళ్లే విమానాన్ని కెనడాకు మళ్లించారు. రెండు రోజుల్లో 10 బాంబు బెదిరింపులు రావడంతో ముమ్మర తనిఖీలు జరిపారు.

నవంబర్ 20న మహారాష్ట్ర ఎన్నికలు

- 13, 20 తేదీల్లో జార్ఖండ్ శాసనసభకు
- నవంబర్ 23న రెండు రాష్ట్రాల ఫలితాలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది. మహారాష్ట్రకు ఒకే దశలో నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. జార్ఖండ్ అసెంబ్లీకి నవంబర్ 13, 20న రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న రెండు రాష్ట్రాల కౌంటింగ్ ఉంటుంది. మహారాష్ట్రలో 9.63 కోట్ల మంది, జార్ఖండ్‌లో 2.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా 47 అసెంబ్లీ స్థానాలకు, వయనాడ్ లోక్‌సభ స్థానానికి నవంబర్ 13న, ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ అసెంబ్లీ స్థానానికి, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానానికి నవంబరు 20న ఉప ఎన్నికల పోలింగ్ జరగనున్నట్టు ప్రకటించారు.

ఈవీఎంలో ఉండేవి సింగిల్ యూజ్ బ్యాటరీలు

హర్యానా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ తర్వాత ఈవీఎంలపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టత ఇచ్చారు. ఈవీఎంలు సురక్షితమైనవని, పటిష్టమైనవని ఆయన పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌లా ఈవీఎంల బ్యాటరీలకు చార్జింగ్ పెట్టడం కుదరదని, వీటిల్లో ఉండేవి కాలిక్యులేటర్లలో ఉండే లాంటి సింగిల్ యూజ్ బ్యాటరీలని తెలిపారు. హెజ్బొల్లా పేజర్లను ఇజ్రాయెల్ హ్యాక్ చేసినట్టు ఈవీఎంలను సైతం హ్యాక్ చేయొచ్చన్న కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ వ్యాఖ్యలను రాజీవ్ కుమార్ కొట్టిపారేశారు. పేజర్లు కనెక్ట్ అయి ఉంటాయని, ఈవీఎంలు అలా ఉండవని పేర్కొన్నారు.

ఆత్మపరిశీలన చేసుకోండి..

కౌంటింగ్ రోజు మీడియా వ్యవహరించే తీరును రాజీవ్ కుమార్ తప్పుపట్టారు. 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైతే 8:05, 8:10 నుంచే ఫలితాలు ప్రసారం చేయడం నాన్సెన్స్ అని పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్‌పైనా స్వీయ ఆత్మపరిశీలన అవసరమని అన్నారు. మహారాష్ట్రలో ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య నేపథ్యంలో హింసను నివారించడానికి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

జార్ఖండ్‌లో జయం ఎవరిది?

- ఎన్డీఏ - జేఎంఎం కూటమి మధ్య హోరాహోరీ
- హేమంత్ సోరేన్ అరెస్టు సానుభూతిపై జేఎంఎం ఆశలు
- అవినీతి ఆరోపణలను అస్త్రంగా వాడుతున్న బీజేపీ

రాంచి, అక్టోబర్ 15: జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి, జేఎంఎం నేతృత్వంలోని అధికార కూటమి మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. గత ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీజేపీ ఈసారి ఎలాగైనా తిరిగి కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. జేఎంఎం సైతం మరోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. విజయంపై రెండు పక్షాలూ ధీమాగా ఉన్నాయి.

ఎన్డీఏ బలాలు – బలహీనతలు

- సీఎం హేమంత్ సోరేన్ సహా జేఎంఎం, కాంగ్రెస్ నేతలపై అవినీతి ఆరోపణలను ప్రధాన ప్రచారాస్త్రంగా బీజేపీ మార్చుకుంది.
- ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్ పార్టీతో పొత్తు, గిరిజనుల్లో పట్టున్న మాజీ సీఎం చంపయీ సోరేన్‌తో పాటు మాజీ ఎంపీ మధు కోడా, మరో ముగ్గురు ఎమ్మెల్యేల చేరిక కలిసొస్తుందని బీజేపీ ఆశలు పెట్టుకుంది.
- జేఎంఎం సర్కారు వైఫల్యం వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు పెరిగాయని, బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటుదారులు పెద్ద సంఖ్యలో వస్తున్నారనే ఆరోపణలను బీజేపీ బలంగా చేస్తున్నది.
- పార్టీ నేతల మధ్య అంతర్గత పోరు బీజేపీకి నష్టం చేసే అవకాశం ఉంది.

జేఎంఎం కూటమి బలాలు – బలహీనతలు

- సీఎం హేమంత్ సోరేన్ అరెస్టుకు, రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ అస్థిరతకు బీజేపీనే కారణమని జేఎంఎం ఆరోపిస్తున్నది. ప్రజల ద్వారా ఎన్నికైన తమ ప్రభుత్వాన్ని పని చేయకుండా బీజేపీ కుట్రలు చేసిందనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నది.
- రాష్ట్రంలోని 81 నియోజకవర్గాల్లో 28 ఎస్టీ రిజర్వుడ్ స్థానాలు ఉన్నాయి. గిరిజనుల్లో సోరేన్‌పై ఉన్న సానుభూతి ఈ నియోజకవర్గాల్లో కలిసొస్తుందని జేఎంఎం ఆశిస్తున్నది.
- ప్రజలకు నేరుగా లబ్ధి కలిగించిన సోరేన్ సర్కారు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు ఓట్లు కురిపిస్తాయని భావిస్తున్నది.
- కీలక నేతలు బీజేపీలో చేరడం, కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాల్లో విభేదాలు ఎన్నికల్లో దెబ్బ తీసే అవకాశం ఉంది.

మహారాష్ట్రలో హోరాహోరీ

- అధికారాన్ని నిలుపుకోవాలనే పట్టుదలతో మహాయుతి
- లోక్‌సభ ఫలితాల ఉత్సాహంతో మహా వికాస్ అఘాడీ
- శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (శరద్ పవార్)కి జీవన్మరణ పోరు

ముంబై, అక్టోబర్ 15: మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్డీఏ, ఇండియా కూటములు ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్ ఇది. మహారాష్ట్రలో ఈసారి నేరుగా అధికారాన్ని దక్కించుకొని ప్రజా మద్దతు తమకే ఉందని నిరూపించుకునేందుకు బీజేపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన మహాయుతి ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు పార్టీల్లో చీలికలతో కోల్పోయిన అధికారాన్ని తిరిగి పొందాలని కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ పట్టుదలగా ఉంది.

మహాయుతి బలాబలాలు

- కేంద్రంలో అధికారంలో ఉండటం, బీజేపీ నేతృత్వంలో మూడు పార్టీల మధ్య సమన్వయం ఉండటంతో పకడ్బందీగా ఎన్నికలకు సిద్ధం.
- ఇటీవల ప్రారంభించిన కొత్త పథకాలు, కేంద్రం భారీగా కేటాయిస్తున్న నిధులు, చేపట్టిన కొత్త ప్రాజెక్టులు ఓట్లు కురిపిస్తాయని మహాయుతి ఆశలు పెట్టుకున్నది.
- హర్యానాలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఇటీవల సాధించిన విజయం కూటమిలో జోష్ నింపింది. ఇక్కడా హర్యానా ఫలితాలను పునరావృతం చేయాలని ప్రయత్నిస్తున్నది.
- మరాఠాల కోటా ఉద్యమం, శివాజీ భారీ విగ్రహం కూలడంతో ప్రజల మనోభావాలు దెబ్బతినడం వంటి పరిణామాలు వ్యతిరేకంగా మారాయి.

మహావికాస్ అఘాడీ బలాబలాలు

- శివసేన, ఎన్సీపీలో చీలికలపై మహారాష్ట్ర ప్రజల్లో సానుభూతి ఉంది. ముఖ్యంగా ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌పై ప్రజలు సానుభూతిని కనబరుస్తున్నారని కూటమి అంచనా వేస్తున్నది.
- లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 48 స్థానాల్లో ఏకంగా 30 స్థానాలను గెలుచుకోవడం కూటమిలో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఫలితాలను రిపీట్ చేయాలని పట్టుదలగా ఉంది.
- సానుభూతి మినహా ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ఇతర బలమైన అంశాలు ఏమీ చూపించలేకపోవడం కూటమికి మైనస్‌గా మారే అవకాశం ఉంది.
- అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి ఎవరు అవుతారనే స్పష్టత లేకపోవడం నష్టం కలిగించొచ్చు.

ఆగని కెనడా కవ్వింపులు

- మరోసారి నోరుపారేసుకున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో
- భారత్ హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపణలు
- నిజ్జర్ హత్య కేసు విచారణకు సహకరించడం లేదని వ్యాఖ్య
- బిష్ణోయ్ గ్యాంగ్‌తో భారత ఏజెంట్లకు సంబంధాలు: కెనడా
- భారత్‌పై ఆంక్షలకు సంకేతాలు

ఒట్టావా: భారత్‌తో కెనడా కయ్యం ముదురుతున్నది. సిక్కు అతివాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసు నేపథ్యంలో ఇరుదేశాల మధ్య మొదలైన గొడవకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మరింత ఆజ్యం పోశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. 'కెనడా ప్రజలను లక్ష్యంగా చేసుకొని, వారి ఇల్లే వారికి అసురక్షితమైనదనే భావన కల్పించేలా హింసాత్మక చర్యలకు, హత్యకు సైతం దౌత్యవేత్తలను, వ్యవస్థీకృత నేరాలను భారత్ ఉపయోగించుకుంటున్నది. తద్వారా భారత్ తీవ్ర తప్పిదానికి పాల్పడిందని నమ్ముతున్నా. ఇది ఆమోదయోగ్యం కాదు. గత వేసవి నుంచి ఫైవ్ ఐస్ కూటమి భాగస్వాములతో(అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా), ప్రత్యేకంగా అమెరికాతో కలిసి పని చేస్తున్నాం. అక్కడా చట్టవ్యతిరేక హత్యాప్రయత్నానికి పాల్పడి భారత్ ఇదే విధంగా వ్యవహరించింది.' అని ట్రూడో ఆరోపించారు. 'కెనడా ప్రజల రక్షణ కోసం, ఇరుదేశాల సంబంధాలు దెబ్బతినకుండా గత వారం భద్రతా సంస్థలు, దౌత్యవేత్తలతో భారత ప్రభుత్వాన్ని సంప్రదించాం. కానీ, దురదృష్టవశాత్తు మాతో కలిసి పని చేయాలని భారత్ అనుకోలేదు. తిరస్కరించడంతో పాటు మా ప్రభుత్వంపై వ్యక్తిగత ఆరోపణలకు దిగింది. ఎన్నిసార్లు కోరినా మాకు సహకరించొద్దని భారత్ నిర్ణయించింది.' అని ట్రూడో పేర్కొన్నారు.

భారత్‌పై ఆంక్షలు!

బిష్ణోయ్ గ్యాంగ్‌తో భారత ప్రభుత్వ ఏజెంట్లకు సంబంధాలు ఉన్నాయని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్(ఆర్సీఎంపీ) ఆరోపించింది. బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉపయోగించుకొని దక్షిణాసియాకు చెందిన వారిని, ప్రత్యేకించి కెనడాలోని ఖలిస్థానీ అనుకూల వ్యక్తులను భారత్ లక్ష్యంగా చేసుకున్నదని ఆర్సీఎంపీ కమిషనర్ మైక్ దుహెన్ ఆరోపించారు. అయితే, నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి తాము ఈ ఆరోపణ చేయడం లేదని, కెనడాలో జరుగుతున్న నేరాల గురించి ప్రజలకు తెలియజేయాలని అనుకుంటున్నట్టు చెప్పారు. మరోవైపు, భారత్‌పై ఆంక్షలు విధించే అవకాశాలు ఉన్నట్టు కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలనీ జోలీ పరోక్షంగా చెప్పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్సీఎంపీ సేకరించిన ఆధారాల మేరకు భారత దౌత్యవేత్తలను బహిష్కరించామని, విచారణ కోసం సహకరించేలా భారత్‌ను కోరుతున్నట్టు చెప్పారు.

ట్రూడో ఆరోపణలను ఖండించిన భారత్

కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. 'ట్రూడో పాత కారణాలతో, అవే పాత విషయాలు చెప్పారు. నిజ్జర్ కేసుకు సంబంధించి భారత్‌కు విశ్వసనీయ ఆధారాలు ఇచ్చామని కెనడా చెబుతున్నది నిజం కాదు. మొదటి నుంచి కెనడా కేవలం అస్పష్ట ఆరోపణలు చేస్తున్నది' అని భారత విదేశాంగ శాఖ పేర్కొన్నది.

ఎన్నికల బరిలో ప్రియాంక గాంధీ

వయనాడ్ అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: ఇప్పటివరకు పార్టీ ప్రచారానికే పరిమితమైన కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగనున్నారు. రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభకు ఉప ఎన్నికను నవంబర్ 13న నిర్వహిస్తామని ఎన్నికల సంఘం మంగళవారం వెల్లడించింది. ఈనీ ప్రకటన వెలువడిన వెంటనే వయనాడ్‌లో ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ప్రియాంక అక్కడ పోటీ చేయడం ద్వారా క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి పార్టీ రంగం సిద్ధం చేసింది.

వాల్మీకి నిధులతో ఓట్ల కొనుగోలు

- బళ్లారిలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం వినియోగం
- ఓటుకు 200 చొప్పున 7 లక్షల ఓటర్లకు పంపిణీ
- చార్జిషీట్‌లో కీలక విషయాలు వెల్లడించిన ఈడీ

బెంగళూరు, అక్టోబర్ 15: కర్ణాటక వాల్మీకి స్కామ్‌కు సంబంధించి దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సంచలన విషయాలను వెల్లడించింది. గిరిజనుల సంక్షేమం కోసం వెచ్చించాల్సిన నిధులను అప్పటి కర్ణాటక గిరిజన శాఖ మంత్రి బీ నాగేంద్ర, అతడి అనుచరులు పక్కదారి పట్టించారని ఈడీ పేర్కొన్నది. ఈ నిధులతో లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారి కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ కోసం ఓట్లను కొనుగోలు చేశారని ఆరోపించింది.

బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో 7 లక్షలకు పైగా ఓటర్లకు రూ.200 చొప్పున పంచినట్టు తెలిపింది. ఇందుకు రూ.14 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించింది.కాంగ్రెస్ కార్యకర్తల ఖర్చుల కోసం మరో రూ.72 లక్షలు ఖర్చు పెట్టారని పేర్కొన్నది. బళ్లారి లోక్‌సభ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి(బళ్లారి సిటీ), గణేష్(కంప్లి), ఎన్‌టీ శ్రీనివాస్(కుడ్లిగి)తో కలిసి నాగేంద్ర ఈ డబ్బులను పంపిణీ చేసినట్టు పేర్కొన్నది.

సొంత ఖర్చులకూ వాడుకున్నారు

వాల్మీకి నిధులను మాజీ మంత్రి బీ నాగేంద్ర తన సొంతానికి కూడా వాడుకున్నట్టు వెల్లడించింది. తనకు, తన అనుచరులకు విమాన టికెట్లు కొనేందుకు, విద్యుత్తు బిల్లులు కట్టేందుకు, వాహనాల నిర్వహణ, ఇంట్లో పని చేసే వారికి జీతాలు ఇచ్చేందుకు కూడా నాగేంద్ర ఈ నిధులను వినియోగించినట్టు వెల్లడించింది. కాగా, రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్టీ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్(కేఎంవీఎస్‌టీడీసీ) నుంచి మార్చి – మే మధ్య కాలంలో 187.33 కోట్లు దారి మళ్లాయనే ఆరోపణలతో సీబీఐ, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మొత్తం వ్యవహారంలో బీ నాగేంద్రదే కీలక పాత్ర అని గుర్తించిన ఈడీ ఆయనను ఏ1గా పేర్కొన్నది.

సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి: బీజేపీ

అవినీతికి, హిందూ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతిని కోరనున్నట్టు కర్ణాటక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర చెప్పారు. ఈ నెల 25న హుబ్బళ్లిలో తమ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపడతామని చెప్పారు.

డ్రోన్ కొను'గోల్‌మాల్' ఖరారు!

- అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు ఒప్పందం
- 150 కోట్లు విలువ చేయని ఒక్కో డ్రోన్‌కు 1,112 కోట్లు
- హాల్, డీఆర్డీవోను కాదని విదేశీ సంస్థకు కేంద్రం కాంట్రాక్ట్
- చెన్నైలో ఇటీవల కూలిన డ్రోన్.. అయినా డీల్‌కు కేంద్రం ఓకే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): అమెరికా సంస్థ జనరల్ అటామిక్స్ (జీఏ) నుంచి ఎంక్యూ-9బీ రకపు 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు ఒప్పందంపై భారత్ సంతకాలు చేసింది. 31 డ్రోన్ల కోసం రూ.34,500 కోట్లు వెచ్చించనున్నట్టు అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ డ్రోన్లలో 15 డ్రోన్లను నేవీకి, చెరో 8 డ్రోన్లను వాయు సేనకు, ఆర్మీకి కేటాయించనున్నారు. 2 వేల మైళ్ల దూరం వరకు నిరంతరాయంగా ఎగిరే ఈ డ్రోన్‌తో 1,700 కిలోల బరువు వరకు ఆయుధాలను తరలించవచ్చు.

డ్రోన్ల రేటుపై విమర్శలు

అంతర్జాతీయ విపణిలో ఇదే మాడల్ ప్రిడేటర్ ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.150 కోట్లు మాత్రమే. అయితే ఒక్కో డ్రోన్‌కు రూ.1,112 కోట్లు చెల్లించేందుకు భారత్ సిద్ధమవ్వడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

స్వదేశీ కంపెనీలను కాదని..

ఈ తరహా డ్రోన్లను మార్కెట్ రేటుకే తయారుచేసే సామర్థ్యం హాల్, డీఆర్డీవో వంటి స్వదేశీ సంస్థలకు ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. 'మేకిన్ ఇండియా' అని పైకి చెప్పే కేంద్రం కాంట్రాక్ట్‌లను మాత్రం విదేశీ కంపెనీలకు కట్టబెడుతున్నదని పలువురు మండిపడుతున్నారు.

ప్రిడేటర్ డ్రోన్లను జీఏ ఏ దేశానికి ఎంతకు విక్రయిస్తున్నదంటే?

దేశం	ఒక్కో డ్రోన్ ఖరీదు
యూకే	రూ. 102 కోట్లు
జర్మనీ	రూ. 139 కోట్లు
అమెరికా	రూ. 450 కోట్లు
భారత్	రూ. 1,112 కోట్లు

మాక్ డ్రిల్‌లో షాక్

గత నెలలో చెన్నైలో ఎంక్యూ-9బీ ప్రిడేటర్ డ్రోన్ మాక్ డ్రిల్‌ను భారత నేవీ నిర్వహించింది. అయితే, పవర్ జనరేటర్‌లో, బ్యాటరీల్లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ఆ డ్రోన్ కుప్పకూలింది. ఇజ్రాయెల్‌తో యుద్ధంలో భాగంగా హౌతీ రెబల్స్ కూడా ఈ తరహా డ్రోన్లను చాలా తేలిగ్గా కూల్చేయడం తెలిసిందే. ఈ ఘటనలు జరిగాక కూడా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ డీల్‌పై సంతకాలు చేయడం సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నది.

ఎందుకంత మక్కువ?

కొద్ది రోజుల్లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ, డెమోక్రటిక్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుంది. ఎనర్జీ సెక్టార్‌లో వేళ్లూనుకొన్న జీఏకు ఇరు పార్టీలతో మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే, జీఏ నుంచి ప్రిడేటర్ డ్రోన్లను కొనుగోలు చేయాలంటూ మాజీ అధ్యక్షుడు ట్రంప్ గతంలో భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. ఇప్పుడు అధికారంలో ఉన్న బైడెన్ ప్రభుత్వం కూడా జీఏ పక్షాన భారత్‌పై ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తున్నది. అధ్యక్ష ఎన్నికల్లో అమెరికాలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ఈ డీల్ కారణంగా భారత్‌లోని ఎన్డీఏ సర్కారుకు రాజకీయంగా ప్రయోజనం చేకూరవచ్చన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ఒత్తిళ్లకు ఎన్డీయే ప్రభుత్వం తలొంచిందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

8 అత్యవసర మందుల ధరలు 50% పెంపు

ఆమోదం తెలిపిన ఎన్‌పీపీఏ

టీబీ, ఆస్తమా, తలసీమియా తదితర ఔషధ ధరలు పైకి

న్యూఢిల్లీ: జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ఎనిమిది అత్యవసర మందుల ధరలను 50 శాతం పెంచడానికి ఆమోదం తెలిపింది. దీంతో టీబీ, ఆస్తమా, తలసీమియా, గ్లకోమా, మానసిక ఆరోగ్య సమస్యలు తదితర రోగాలకు వాడే బెంజిపెన్సిలిన్, ఆట్రోపైన్, స్ట్రెప్టోమైసిన్, సాల్బుటమాల్, పిలోకార్పైన్, సెఫడ్రాక్సిల్, డెస్ఫెరొగ్జామైన్, లిథియం మందుల ధరలు పెరగనున్నాయి. ముడి సరకుల ధరలు, ఉత్పత్తి ఖర్చులు పెరిగి పోవడంతో ఆయా మందుల ఉత్పత్తి ఆచరణ సాధ్యం కాకుండా పోయిందని తయారీ కంపెనీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో వాటి ధరలు పెంచడానికి ఎన్‌పీపీఏ అంగీకరించింది.

సముద్రంలో చిక్కుకొని 67 రోజులు జీవన పోరాటం

- బతికి బయటపడిన రష్యా పౌరుడు
- బోటులోనే ప్రాణాలు విడిచిన సోదరుడు, మేనల్లుడు

మాస్కో: తిమింగలాలను చూడడానికి వెళ్లి సముద్రంలో చిక్కుకుపోయిన ఓ వ్యక్తి 67 రోజుల పాటు జీవన పోరాటం చేసి బతికి బయటపడ్డాడు. తన వెంట వచ్చిన సోదరుడు, మేనల్లుడు మాత్రం ప్రాణాలు కోల్పోయారు. రష్యాకు చెందిన మైఖేల్ పిచుగన్(46) ఆగస్టు నెల ఆరంభంలో తిమింగలాలను చూడటానికి సోదరుడు, మేనల్లుడితో కలిసి చిన్న పడవలో ఫంటర్ ద్వీపానికి వెళ్లాడు. ఆగస్టు 9న షక్లిన్ ద్వీపానికి తిరిగి వస్తున్నప్పుడు ఇంజిన్ విఫలం కావడంతో వారి పడవ సముద్రంలో చిక్కుకుపోయింది. 67 రోజుల తర్వాత అటుగా వెళ్తున్న చేపల బోటు సిబ్బందికి పిచుగన్ బోటు కనిపించింది. స్పాట్ లైట్ వేసి చూస్తే అందులో పిచుగిన్ కనిపించడంతో వారు షాక్ తిన్నారు. పిచుగిన్‌ను రక్షించినప్పుడు అతడు బాగా శుష్కించి సగం బరువు కోల్పోయాడు. అతడ